కొంతకాలానికి నాకు అర్థమైంది, నా తోక ఎప్పుడూ నాతో వుంటూ, నేను ఎక్కడికి వెళ్ళినా అది నన్ను అనుసరిస్తూంటుందని. ఈ రహస్యం తెలీగానే నేను దాన్ని అందుకునే ప్రయత్నం మానేసాను."

వేదం, ఉపనిషత్తులు, గురువులు బోధించే సత్యం ఇదే. మనం అనందం కోసం ప్రపంచంలోని అనేక వస్తువులు, మనుష్యులు, పరిస్థితులు వెంట పరిగెడుతూన్నంత కాలం నిజమైన ఆనందాన్ని మనం అందుకోలేం. ఆనందం అనేది మనలోనే సదా, శాశ్వతంగా, అపరిమితంగా వుందని గ్రహించాక దానికోసం వెంపర్లాడక్కర్లేదు. మనకి ఆత్మదర్శనం అవగానే పై సత్యం అనుభవంలోకి వస్తుంది.

## 124. రెండు నాలుకలు

రబియా అనే పారశీక భక్తురాలు ఓ అలవికాని జబ్బుతో బాధపడసాగింది. ఒకరు ఆమెని అడిగారు.

"అమ్మా! ఆధ్యాత్మికంగా నువ్వు గొప్ప స్థితిలో ఉన్నావు. నీ రోగాన్ని నయం చేయమని నువ్వు దేవుడ్ని ప్రార్థిస్తే అల్లా కాదనలేడు కదా?"

"అలా ప్రార్థించడానికి నాకు రెండు నాలుకలు వుంటేగా?" జవాబు చెప్పింది రబియా.

"అంటే?" అర్థం కాక అడిగాడు అతను.

"నేనెప్పుడూ అల్లాని, 'జరిగేదంతా నీ ఇచ్ఛ ప్రకారం జరుగుగాక' అని ప్రార్థిస్తూంటాను. నా జబ్బు భగవంతుని ఇచ్ఛ తోనే వచ్చాక, దానిని తొలగించమని ప్రార్థించడానికి నాకు రెండో నాలుక ఉంటేగా?" జవాబు చెప్పిందామె.

సత్పురుషులకి తమ కష్టాలని భగవంతుడే స్వయంగా కల్గించాడని తెలుసు కాబట్టి, వాటిని తొలగించమని ప్రార్థించరు. ఎందుకంటే వారు భగవంతుడి ఇచ్ఛే తమ ఇచ్ఛ అనుకొంటూ జీవిస్తారు.